నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 19 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

# ఖమ్మంలో 'భీమ జ్యువెల్స్'

- షోరూమ్‌ను ప్రారంభించిన సినీ నటి రీతూ వర్మ
- షోరూం వద్ద సందడి చేసిన అభిమానులు, నగరవాసులు



భీమ జ్యువెల్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి రీతూ వర్మ, చైర్మన్

రఘునాథపాలెం, జనవరి 18 : డైమండ్, బంగారు, వెండి ఆభరణాల ప్రముఖ దిగ్గజ సంస్థ 'భీమ జ్యువెల్స్' ఖమ్మంలో తన నూతన షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. భారతదేశం, యుఏఈ వ్యాప్తంగా 70 షోరూమ్‌లు కలిగిన భీమ జ్యువెల్స్ ఇప్పుడు ఖమ్మం జిల్లా ప్రజలకూ చేరువైంది. శనివారం ఖమ్మం నగరం వైరా రోడ్డులోని బాబూరావు పెట్రోల్ బంక్ ఎదుట భీమ జ్యువెల్స్ నూతన షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ప్రముఖ హీరోయిన్ రీతూ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. రీతూ వర్మ వస్తున్న విషయం తెలుసుకున్న ఆమె అభిమానులు పెద్ద ఎత్తున షోరూం వద్దకు చేరుకోగా.. వారిని చూసి అభివాదం చేస్తూ.. బాగున్నారా.. అంటూ పలకరించారు. అనంతరం ఆమె షోరూంలో విక్రయానికి ఉంచిన డైమండ్, బంగారు, వెండి ఆభరణాలను పరిశీలించారు. చైర్మన్ బి.బిందు మాధవ్, మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ బిందు మాధవ్, డైరెక్టర్ సరోజిని బిందు మాధవ్ షోరూంలో అందుబాటులో ఉంచిన వజ్రాలు, బంగారం ఆభరణాల వెరైటీలను గురించి వివరించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ విజయ నిర్మల, భీమ జ్యువెల్స్ సీవోవో గోపకుమార్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి రీతూ వర్మ, చైర్మన్

# మూడునెలల ముచ్చటే..!

- అంగన్‌వాడీ మినీ టీచర్లకు అప్‌గ్రేడ్ కష్టాలు
- మూడునెలలే కొత్త జీతాలు.. 10 నెలలుగా పాత జీతాలే..
- ఉద్యోగోన్నతులు ఇచ్చి ఫలితం లేకపోయే..
- ధర్నాలు, ముట్టడులు చేసినా పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 626 మందికి చేకూరని లబ్ధి
- రోడ్డెక్కేందుకు సిద్ధమైన 'మినీ టీచర్లు'

*అంగన్‌వాడీ టీచర్లకు అప్‌గ్రేడ్ కష్టాలు తప్పడం లేదు. మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేసి ఏడాది గడిచినా వారి జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పులేదు. గతేడాది జనవరి 3వ తేదీన మినీ టీచర్లను అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే మూడునెలలు మెయిన్ టీచర్ల జీతం ఇచ్చి మళ్లీ పాత జీతంతోనే సరిపెడుతున్నది. దీంతో మినీ టీచర్లు గత 10 నెలలుగా పాత జీతాలతోనే సర్దుకోవాల్సి వస్తున్నది. మెయిన్ టీచర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని కోరుతూ ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఫలితం లేకపోవడంతో రోడ్డెక్కడానికి సిద్ధంగా ఉన్నారు అంగన్‌వాడీ టీచర్లు.*

*- భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 18 (నమస్తే తెలంగాణ)*

అంగన్‌వాడీ మినీ టీచర్లకు ఉద్యోగోన్నతులు ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. జిల్లాలో ఇప్పటివరకు 1,434 అంగన్‌వాడీ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దీంతోపాటు చిన్న గ్రామాలు, తండాల్లో మినీ సెంటర్లు ఉన్నాయి. మారుతున్న జనాభా దృష్ట్యా మినీ సెంటర్లను కూడా అప్‌గ్రేడ్ చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ప్రతిపాదన తీసుకొచ్చింది. అమలుచేసే క్రమంలో ఎన్నికలు జరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రతిపాదన మూలనపడింది. అయితే అంగన్‌వాడీ టీచర్ల పోరాటం ద్వారా మినీలను మెయిన్ చేస్తూ జీవో జారీ చేసింది. కానీ.. అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. జనవరిలో మినీలను మెయిన్ చేస్తూ వచ్చిన జీవోకు కేవలం మూడునెలలు మాత్రమే మినీ టీచర్లకు మెయిన్ టీచర్లతో సమానంగా జీతాలు ఇచ్చారు. కానీ.. ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో మళ్లీ పాత జీతాలనే ఇస్తున్నారు. దీంతో యూనియన్ నాయకులు టీచర్లు కలిపి సీఎం, మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అయినప్పటికీ అది నేటికీ కార్యరూపం దాల్చలేదు.



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు టీచర్

### 626 మందికి చేకూరని లబ్ధి

జిల్లావ్యాప్తంగా 626 మంది మినీ టీచర్లకు లబ్ధి చేకూరలేదు. మినీ టీచర్లకు రూ.7,500 రాగా, మెయిన్ టీచర్లకు రూ.13,500 వేతనం ఇస్తున్నారు. అప్‌గ్రేడ్ అయిన 626 మంది మందికి నేటికీ లబ్ధి చేకూరలేదు. దీంతో ఎప్పటిలాగా మినీ కేంద్రాల వలే పిల్లలకు వండిపెట్టడం వారివంతవుతుంది. దీంతో ఆయాల నియామకం కూడా నిలిచిపోయింది. పేరుకే అప్‌గ్రేడ్ చేసినా టీచర్లంతా పాత పద్ధతినే సెంటర్లను నడిపిస్తున్నారు. అంగన్‌వాడీ మెయిన్ టీచర్‌గా జాబితాలో పేరు ఉన్నా హెల్పర్ పనులు కూడా చేయాల్సి వస్తున్నది. మిగతా టీచర్లు పిల్లలకు విద్య నేర్పిస్తుంటే మినీ టీచర్లు పిల్లలకు వండిపెట్టడంతో సరిపోతున్నది.

### పనులు బారెడు.. జీతాలు మూరెడు..

అంగన్‌వాడీలో టీచర్ల పరిస్థితి పనులు బారెడు.. జీతాలు మూరెడు అన్నట్లుగా ఉంది. ప్రతి సర్వే అంగన్‌వాడీ టీచర్ చేయాల్సిందే.. కానీ.. వారి బాగోగులు మాత్రం ఎవరూ పట్టించుకోరు. ఆదివారం కూడా డ్యూటీలు వేస్తుంటారు. తాగునీటి సమస్యపై కూడా అంగన్‌వాడీలే సర్వే చేయాలి. వైద్య శాఖ, కుటుంబ సమగ్ర సర్వే కూడా అంగన్‌వాడీలనే బాధ్యులను చేశారు. టీచర్లకు తోడుగా సర్వే బాధ్యతలు అప్పగించారు. ప్రతి పనికి ఒక యాప్ పెట్టడంతో.. యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయడంతోనే కాలం సరిపోతున్నదని వారు వాపోతున్నారు.

### పాత జీతాలే ఇస్తున్నారు..



ఎప్పుడో అప్‌గ్రేడ్ చేశారు. మూడంటే మూడు నెలలు మెయిన్ టీచర్‌తో సమానంగా జీతం ఇచ్చారు. తర్వాత 10 నెలలుగా పాత జీతాలే ఇస్తున్నారు. ఎవర్ని అడిగినా సమాధానం చెప్పడం లేదు. యూనియన్ నాయకులు పోరాటాలు చేస్తున్నారు. ఉన్నతాధికారులను కలిసి మొర పెట్టుకున్నా.. ఫలితం లేదు. ఎంతకాలం ఇలా చాకిరీ చేయాలి. పనులు ఎక్కువ.. జీతాలు తక్కువ. ప్రతి పనికి, సర్వేకు మమ్మల్నే పిలుస్తున్నారు.

– పాయం భానుశ్రీ, అంగన్‌వాడీ టీచర్, పాల్వంచ

### అప్పుడూ ఇప్పుడూ అవే కష్టాలు..



కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లపై చిన్నచూపు చూస్తున్నది. అదనపు పనులు చేయిస్తున్నారు.. వేతనాలు మాత్రం తక్కువగా ఇస్తున్నారు. మినీ టీచర్లను మెయిన్ చేసినప్పటికీ ఉపయోగం లేదు. జీతాలు పాతవే ఇస్తున్నారు.. మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. మళ్లీ రోడ్డెక్కాల్సి వస్తుందేమో.. ఎన్ని అడ్డంకులు వచ్చినా సాధిస్తాం. సరైన జీతాలు లేకుండా ఎంత కాలం పని చేయాలి.

– మట్టా విజయశ్రీ, కే లక్ష్మీపురం, దుమ్ముగూడెం మండలం

### ఫైనాన్షియల్ అప్రూవల్ రాలేదు..



మినీ టీచర్లను మెయిన్ చేసి ఏడాది అయ్యింది. గతంలో వారికి వేరే యాప్ ద్వారా జీతాలు చెల్లించేవారు. ఇప్పుడు మెయిన్ టీచర్‌లాగా జీతాలు ఇవ్వాలంటే సాంకేతిక సమస్య అడ్డుగా ఉంది. ఫైనాన్షియల్ అప్రూవల్ కూడా రాలేదు. అందువల్ల జీతాలు ఆలస్యమవుతున్నాయి. ఫిబ్రవరి నుంచి వారికి రెగ్యులర్‌గా జీతాలు వస్తాయి.

– స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమాధికారి




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు(ఫైల్)

# బీఆర్‌ఎస్ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి

తండాలు, గూడేలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

టేకులపల్లి, జనవరి 18 : గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ అన్నారు. మండలంలోని సుక్కలబోడు, జేత్యాతండా, కొత్త తండాల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, జిల్లా నాయకుడు లక్కినేని సురేందర్‌రావులతో కలిసి శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో హరిప్రియానాయక్ మాట్లాడుతూ స్థానిక సంస్థలకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు శ్రమించి పనిచేయాలన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తండాలు, గూడేలు మరింతగా అభివృద్ధి చెందడానికి వాటిని పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. రైతుల అభివృద్ధి కోసం పంట పెట్టుబడి, రాయితీలు కల్పించి వారిని అన్ని రకాలుగా ఆదుకున్నది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. పార్టీ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలునాయక్, భూక్యా బాలకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

# అబ్బూరి సర్కిల్‌ను తొలగించడం హేయమైన చర్య

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్



ఆత్కూరులో అబ్బూరి సర్కిల్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, కమల్‌రాజు

మధిరరూరల్, జనవరి 18 : ఆత్కూరు గ్రామంలో అబ్బూరి సర్కిల్ బోర్డును తొలగించడం హేయమైన చర్య అని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. ఆత్కూరు గ్రామంలో అబ్బూరి సర్కిల్‌ను తొలగించిన ప్రదేశాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం అబ్బూరి రామకృష్ణ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాలపాటు కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధాన్ని తెంచుకొని బీఆర్‌ఎస్ పాలనకు ఆకర్శితులై అబ్బూరి రామకృష్ణ పార్టీలో చేరారన్నారు. ఆత్కూరు సర్కిల్‌లో ఆయన పేరుతో ఉన్న బోర్డును అధికారంతో తొలగించినా గ్రామ ప్రజల మనస్సులో ఆయన ఎప్పటికి ఉంటారన్నారు. రాజ్యాంగేతర శక్తులే రాజ్యాన్ని పాలిస్తున్నాయని, రాజ్యాంగ పదవులు లేని వారికి ప్రొటోకాల్ ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రజలను ఎలా మోసం చేయాలో కాంగ్రెస్ పాలనను చూసి నేర్చుకోవచ్చని, దుమ్ముంటే డిప్యూటీ సీఎం కదిలిరావాలని, ఆయన సొంత ఊరిలో ఎంత మందికి రుణమాఫీ అయ్యిందో చర్చిద్దామన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే అధికారులతో మళ్లీ బోర్డు పెట్టిస్తామని స్పష్టం చేశారు. రిటైర్డు అయినా ఆ అధికారులను వదిలిపెట్టమని, క్యాబినెట్ మినిస్టర్ ఆధ్వర్యంలో అదే సెంటర్‌కు నామకరణం చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# గుడారాల తొలగింపు వద్ద ఉద్రిక్తం

- ఖాళీ చేయించొద్దని ఒంటిపై పెట్రోల్ పోసుకుని పలువురి ఆత్మహత్యాయత్నం
- అసంపూర్తి 'డబుల్' నిర్మాణాలు ఆక్రమించారని ఖాళీ చేయించిన అధికారులు
- తోపులాటలో స్పృహతప్పి పడిపోయిన మహిళ



ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మహిళలు



ఆక్రమణదారులను ఈడ్చుకెళుతున్న మహిళా పోలీసులు

దమ్మపేట, జనవరి 18 : అసంపూర్తి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల మధ్య గుడారాలు వేసుకున్న పలు కుటుంబాలను పోలీసులు, రెవెన్యూ అధికారులు బలవంతంగా ఖాళీ చేయించారు. దీంతో వారు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తోపులాటలో ఓ మహిళ స్పృహతప్పి పడిపోయింది. ఈ ఘటన దమ్మపేట మండల కేంద్రంలోని మల్లారం కాలనీలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చిరు వ్యాపారాల నిమిత్తం పలు కుటుంబాలు దమ్మపేటకు వచ్చి అద్దెకు ఉంటూ ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పడం.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు ఎన్నికలు రావడంతో మధ్యలోనే నిలిచిపోవడం.. దీంతో ఇళ్లు లేని నిరుపేదలు గత పది రోజులుగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ ప్రాంతంలో గుడారాలు వేసుకుని ఉంటున్నారు. వారంతా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను ఆక్రమించారని ఆరోపిస్తూ పోలీసులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది వారి గుడారాలను తొలగించేందుకు పూనుకున్నారు. దీంతో పలువురు మహిళలు, యువకులు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గుడారాలను పోలీసులు, రెవెన్యూ అధికారులు తొలగిస్తుండగా అడ్డువచ్చిన మహిళలను ఈడ్చుకుంటూ వెళ్లి పోలీసు వాహనంలోకి ఎక్కించారు. తోపులాటలో ఓ మహిళ స్పృహతప్పి పడిపోగా ఆమెను పోలీసు వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. విధి నిర్వహణలో తమను అడ్డుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికిశోర్‌రెడ్డి, తహసీల్దార్ వాణి తెలిపారు. కాగా.. అధికారులు ఆక్రమణదారులనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు అందించేందుకు కృషి చేస్తున్నదని, మీరంతా దరఖాస్తు చేసుకుంటే అర్హులైన వారికి ఇళ్లు కేటాయిస్తారని తెలిపారు. ఇలా ఆక్రమణలకు పాల్పడొద్దని, అధికారుల విధులను అడ్డుకోకుండా సంయమనం పాటించాలని సూచించారు. మరోవైపు తాము నివసిస్తున్న గుడారాలను తొలగిస్తే మా పరిస్థితి ఏమిటని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఏదులాపురం ఇక మున్సిపాలిటీ..

గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం




ఏదులాపురం గ్రామ సూచిక బోర్డు

ఖమ్మం రూరల్, జనవరి 18 : పన్నెండు పంచాయతీలను ఏకం చేసి ఏదులాపురం పేరుతో మున్సిపాలిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఇందుకు సంబంధించి బ్లూప్రింట్‌ను ప్రభుత్వం ఆమోదం కోసం కలెక్టర్ కార్యాలయానికి పంపించింది. ప్రస్తుతానికి మండలంలో 31 గ్రామపంచాయతీలు ఉండగా.. మరో నాలుగు పంచాయతీల ఏర్పాటుకు కొద్ది రోజుల్లోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. దీంతో మొత్తంగా 35 పంచాయతీలు కాబోతుండగా.. వీటిలో నుంచి పన్నెండు పంచాయతీలు అనగా.. ఏదులాపురం, గొల్లగూడెం, బారుగూడెం, గుదిమళ్ల, చిన్న వెంకటగిరి, గుర్రాలపాడు, మద్దులపల్లి, ముత్తగూడెం, పెద్దతండా, పోలేపల్లి, రెడ్డిపల్లి, పల్లెగూడెం(పార్టు), తెల్దారుపల్లి ఇక నుంచి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోకి రానున్నాయి. దీంతో మరో 23 గ్రామాలతో నేడో రేపో యం వెంకటాయపాలెం కేంద్రంగా నూతన మండలం అవతరించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి.

# 'సంక్షేమ' సర్వేను వేగవంతం చేయాలి

భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : నాలుగు సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంక్షేమ పథకాల అమలుపై అదనపు కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కచ్చితమైన సమాచారం సేకరించాలన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున రెండు విడుతలుగా రూ.12 వేలు, భూ భారతి పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందన్నారు. ఇళ్లు, కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్, లే అవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి తొలగించాలని సూచించారు. జిల్లాలోని 354 రెవెన్యూ గ్రామాలకు.. ఇప్పటివరకు 194 రెవెన్యూ గ్రామాల సర్వే పూర్తి అయిందని, మిగిలిన 160 రెవెన్యూ గ్రామాల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్త రేషన్ కార్డు మంజూరులో భాగంగా ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా జిల్లాలో 29,141 దరఖాస్తులు వచ్చాయని, కార్డులో కొత్త సభ్యులను జతపర్చడానికి 10,796 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారులు సర్వే సందర్భంగా కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆయన సూచించారు.